# హైకోర్టు సీజేగా జస్టిస్ ఏకే సింగ్?

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు
- కోల్‌కతా హైకోర్టుకు జస్టిస్ సుజయ్‌పాల్ బదిలీ

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌ను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినట్టు తెలిసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం ఈ మేరకు కేంద్రానికి సిఫారసు పంపినట్టు సమాచారం. జస్టిస్



ఏకే సింగ్ ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. 1965 జూలై 7న జస్టిస్ ఏకే సింగ్ జన్మించారు. 1990లో పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2012లో జార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2022 డిసెంబర్ నుంచి 2023 ఫిబ్రవరివరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2023 ఏప్రిల్ 17న ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతితో త్రిపుర హైకోర్టుకు బదిలీ అయ్యారు. జస్టిస్ అలోక్ అరాధే బాంబే హైకోర్టుకు బదిలీ అయిన నాటి నుంచి తెలంగాణ హైకోర్టు సీజే పోస్టు ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరి నుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న జస్టిస్ సుజయ్‌పాల్‌ను కోల్‌కతాకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసులపై అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

# యాక్టింగ్ సీజే సుజయ్‌పాల్ బదిలీ

- మళ్లీ తెలంగాణ హైకోర్టుకు ఏపీ క్యాడర్ జడ్జి
- కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధా న న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ సహా దేశంలోని 11 రాష్ట్రాల హైకోర్టుల్లో న్యాయమూర్తులుగా పనిచేస్తున్న 21 మందిని బదిలీచేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం తీసుకున్నది. జస్టిస్ సుజయ్‌పాల్ కోల్‌కతాకు బదిలీ అయ్యారు. గతంలో తెలంగాణ హైకోర్టులో పనిచేసి కర్ణాటక, బీహార్‌కు బదిలీ అయి న ముగ్గురు న్యాయమూర్తులు తిరిగి తెలంగాణ హైకోర్టుకు రానున్నారు. జస్టిస్ సీ సుమలత, జస్టిస్ కన్నెగంటి లలిత కర్ణాటక హైకోర్టు నుంచి, జస్టిస్ అన్నిరెడ్డి అభిషేక్‌రెడ్డి పాట్నా హైకోర్టు నుంచి తిరిగి రానున్నారు. ఏపీ క్యాడర్‌కు చెందిన జస్టిస్ కన్నెగంటి లలిత గతంలో ఆ రాష్ట్రం నుంచి తెలంగాణకు, ఆ తర్వాత కర్ణాటకకు బదిలీ అయ్యారు. ఇప్పుడు ఆమె మళ్లీ తెలంగాణకే రానున్నారు. ఇదే విధంగా ఏపీ నుంచి మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయిన జస్టిస్ భట్టు దేవానంద్ తిరిగి ఏపీకి రాబోతున్నారు. సుప్రీంకోర్టు సీజే జస్టిస్ బీఆర్ గవాయ్ అధ్యక్షతన ఈ నెల 26న జరిగిన కొలీజియం సమావేశం ఈ బదిలీల విషయమై కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది.



జస్టిస్ సుజయ్‌పాల్



జస్టిస్ అభిషేక్‌రెడ్డి





జస్టిస్ లలిత, జస్టిస్ సుమలత

## పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

- రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మంజూరు పత్రాలివ్వండి
- వచ్చే నెల 2 నుంచి ప్రారంభించండి
- అధికారులకు భట్టి ఆదేశం

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మంజూరు లెటర్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. జూన్ రెండు నుంచి తొమ్మిది వరకు అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో రాజీవ్ యువ వికాసం పథకంపై డిప్యూటీ సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు జూన్ 10 నుంచి 15 వరకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. జూన్ 15 తర్వాత గ్రౌండింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అక్టోబర్ రెండు నాటికి లక్ష్యంగా పెట్టుకున్న ఐదు లక్షల



మంది యువతకు స్వయం ఉపాధి కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా ఈ కార్యక్రమం చేపట్టి దశలవారీగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్సీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాల మాయాదేవి, మైనార్టీ సంక్షేమశాఖ కమిషనర్ యాస్మిన్ భాషా, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను వివరించిన త్రిసభ్య కమిటీ

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇటీవల ప్రభుత్వం ముగ్గు రు ఉన్నతాధికారులతో ఏర్పాటుచేసిన త్రిసభ్య కమిటీ.. సబ్‌కమిటీ చైర్మన్ మల్లు భట్టి విక్రమార్కతో భేటీ అయ్యింది. ఉద్యో గ సంఘాలు లేవనెత్తిన సమస్యలను భట్టికి సీసీఎల్‌ఏ కార్యదర్శి నవీన్‌మిట్టల్, పంచాయతీరాజ్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ వివరించారు.

## అమృత్‌సర్‌లో చేతిలో బాంబు పేలి తీవ్రవాది మృతి

న్యూఢిల్లీ, మే 27: బాంబులు పెట్టి అమాయకుల ప్రాణాలు తీయాలనుకున్న ఒక తీవ్రవాది దానికే బలైపోయాడు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో బాంబు పెట్టడానికి ప్రయత్నించగా, అది పేలి ఒక తీవ్రవాది మరణించాడు. అమృత్‌సర్ శివారులోని మజితా రోడ్‌కు ఆనుకుని ఉన్న నౌషెరా గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. నిషేధిత తీవ్రవాద సంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ (బీకేఎల్)కు చెందిన వాడిగా భావిస్తున్న దుండగుడు మంగళవారం ఉదయం బాంబు పెట్టడానికి ప్రయత్నిస్తుండగా, అది చేతిలోనే పేలిపోవడంతో అతని రెండు చేతులు ఛిద్రమయ్యాయి. తీవ్రంగా గాయపడిన అతడిని దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. ఫోరెన్సిక్ బృందం, పంజాబ్ పోలీస్ బాంబ్ డిస్పోజ్ బృందాలు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించాయి.

# మంచాలలో లంచాల పర్వం!

- కేజీబీవీల్లో మంచాల కొనుగోలులో గోల్‌మాల్
- ధరలు రెట్టింపు చేసి అనుకూల సంస్థలకు టెండర్లు
- 163 కోట్ల పనులపై అవినీతి ఆరోపణలు

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): కమీషన్ల రాజ్యంలో మరో అవినీతి బాగోతం వెలుగు చూసింది. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్న పాఠశాల విద్యావిభాగంలో రూ.163 కోట్ల టెండర్లపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) విద్యార్థినుల కోసం కొనుగోలు చేస్తున్న బంకర్ బెడ్ల టెండర్లలో దోపిడీకి తెరదీసినట్టు ఆ శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక్కో మంచం ఖరీదును వంద శాతం పెంచి, అస్మదీయులకు టెండర్లు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారని చెప్పుకుంటున్నారు. రూ.17 వేలు ఖర్చయ్యే యూనిట్ ధరను రూ.36 వేలకు పెంచినట్టు ఆరోపిస్తున్నారు. సర్వశిక్ష అభియాన్ కింద రాష్ట్రవ్యాప్తంగా 495 కేజీబీవీ పాఠశాలలు రాష్ట్రంలో నడుస్తున్నాయి. వీటిలోని 252 స్కూళ్లలో విద్యార్థినుల కోసం 45,360 బంకర్ బెడ్లను, పరుపులు, దిండ్లతో సహా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్ 30న ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచింది. ఈ నెల 14న గడువు ముగిసింది. ఈ టెండర్లలో నగరానికి చెందిన సంస్థ ఎల్-1గా, ముంబైకి చెందినదిగా చెప్తున్న మరో సంస్థ ఎల్-2గా నిలిచాయి. అయితే.. ఎల్-1గా నిలిచిన సంస్థ వాస్తవానికి ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ అని, ముంబైకి చెందిన మెథోడెక్స్ అనే కంపెనీ నుంచి ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మానుఫ్యాక్చర్ సర్టిఫికెట్ (వోఈఎం) తెచ్చుకున్నదని, ఎల్-2 కూడా అదే సంస్థ నుంచి వోఈఎం తెచ్చుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### రెట్టింపు ధరలు..

రెండు సంస్థలకు సప్లయర్ ఒక్కరే.. సరఫరా చేసే మెటీరియల్ కూడా ఒక్కటే. దీనిని బట్టే రెండు సంస్థలూ ముందే కూడబలుక్కొని రెండు టెండర్లు వేసినట్టు ఆరోపిస్తున్నారు. వాస్తవ ధరకు రెట్టింపు కోట్ చేసినా ఆ సంస్థలకే టెండర్లు దక్కడం వెనుక ఏదో మతలబు ఉన్నదని చర్చించుకుంటున్నారు. టెండర్ నోటిఫికేషన్ ప్రకారం ఒక్కో మంచం బరువు 72.28 కిలోలు ఉండాలి. పరుపు 3 ఇంచుల మందం ఉంటే చాలు. వీటితోపాటు రెండు కాటన్ దిండ్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి మనం వాడే పరుపుల కనీస మందం 4 ఇంచులు. కానీ.. విద్యార్థినులకు ప్రతిపాదించిన పరుపు మందం 3 ఇంచులు మాత్రమే ఉండటం గమనార్హం. ప్రస్తుతం మార్కెట్లో 32 ఎంఎం ఇనుప రాడ్ ఖరీదు కిలో దాదాపు రూ.77 ఉన్నది. ఈ లెక్కన ఒక్కో మంచాన్ని పూర్తిగా ఇనుముతో తయారు చేసినా రూ.ఏడు వేలకు మించి ఖరీదు కాదని, తయారీ ఖర్చు కలిపినా రూ.10 వేలకు మించదని నిపుణులు పేర్కొంటున్నారు. పరుపు, దిండ్లు కలిపి, సమంజసమైన మార్జిన్ వేసుకున్నా గరిష్ఠంగా రూ.17వేలకు మించదని స్పష్టం చేస్తున్నారు. కానీ, ఎల్1గా నిలిచిన సంస్థ ఏకంగా ఒక్కో యూనిట్ ఖరీదు రూ.36 వేలుగా కోట్ చేసినట్టు తెలిసింది. దీంతో దాదాపు రూ.78 కోట్లతో పూర్తి కావాల్సిన బంకర్ బెడ్ల సరఫరా.. రూ.163 కోట్లకు పెరిగిపోయిందని చర్చ జరుగుతున్నది. ప్రభుత్వ పెద్దల జోక్యంతోనే ఈ వ్యవహారం సాగుతున్నదని అనుమానిస్తున్నారు. టెండర్ నోటిఫికేషన్‌లోనే ఆయా సంస్థల ప్రొఫైల్స్‌కు అనుగుణంగా నిబంధనలు ఉండేలా జాగ్రత్తపడినట్టు ఆరోపిస్తున్నారు. దీంతో అస్మదీయ కంపెనీలే టెండర్లు వేశాయని, వాటికే కాంట్రాక్టు కట్టబెట్టారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇందులో ఎల్-1కు 70శాతం సరఫరా కాంట్రాక్టు, ఎల్-2కు 30 శాతం కాంట్రాక్టును ఇవ్వనున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.



## కాంట్రాక్టు ఉద్యోగులకు 2 నెలల వేతనాలు

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న 2,600 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రెండు నెలల జీతాలు మంగళవారం జమ అయ్యాయి. 'మూడు నెలల నుంచి జీతాలు లేవు' శీర్షికన సోమవారం 'నమస్తే తెలంగాణ'లో కథనాన్ని ప్రచురించింది. ప్రభుత్వ దవాఖానల్లో వీరంతా ఎక్స్‌రే, ల్యాబ్, ఈసీజీ టెక్నీషియన్లు, బ్లడ్ బ్యాంక్, పేషెంట్ కేర్, ఆయాలు, శానిటేషన్, సెక్యూరిటీ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి మూడు నెలల నుంచి జీతాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని కథనాన్ని ప్రచురించగా స్పందించిన ప్రభుత్వం వారికి రెండు నెలల జీతాలు జమ చేసింది. జీతాలు జమ కావడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేసి 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఏసీబీ అధికారుల పేరిట నకిలీ కాల్స్

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): కొంతమంది ఏసీబీ అధికారుల పేరుతో ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ తరహా మోసం ఇటీవల ఖమ్మంలో వెలుగుచూసిందని, దీనిపై టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని చెప్పారు.

## 'పంచాయతీరాజ్'లో ప్రమోషన్లు ఎప్పుడు?

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎంతో కీలకమైన రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ (పీఆర్ఆర్డీ)లో ఉద్యోగులెందరో ప్రమోషన్ల కోసం చాలాకాలంగా ఎదురు చూస్తున్నారు. అర్హులైన సీనియర్ అధికారుల జాబితాను ఆరు నెలల క్రితమే ప్రభుత్వానికి పంపినా పట్టింపులేదు. మరోసారి పంపించినా సీఎం కార్యాలయం నుంచి స్పందనే కరువైంది. దీంతో వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 539 ఎంపీడీవో పోస్టులు ఉండగా, దాదాపు 120 పైచిలుకు పోస్టులు ఖాళీగా ఉన్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులు (డీపీవో) 32 మంది ఉన్నారు. వీరంతా పదోన్నతుల కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం 37 జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ (డీసీవో) పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ఆ 37 పోస్టుల కోసం ప్రమోషన్లకు అర్హులైన సీనియర్ అధికారులు సుమారు 100 మందికిపైగా పోటీపడుతున్నారు.

### ఒక్క పోస్టుకు ముగ్గురు పోటీ

ఒక్క పోస్టు ప్రమోషన్ కోసం ముగ్గురు అధికారుల పేర్లతో కూడిన జాబితా పంపినట్టు అధికారవర్గాలు తెలిపాయి. 6 నెలల క్రితం కూడా ప్రమోషన్లకు సంబంధించిన అధికారుల జాబితాను పంపించారు. ఆరు నెలలైనా ఆ జాబితాకు మోక్షం కలుగకపోవడంతో మరోసారి జాబితాను పంపాలని ఉన్నతాధికారులు సూచించినట్టు తెలిసింది. ఆ మేరకు నెల క్రితమే పంచాయతీరాజ్‌శాఖ నుంచి ప్రమోషన్లకు అర్హులైన అధికారుల జాబితాను ప్రభుత్వానికి అందజేసినట్టు సమాచారం. అందులో ప్రభుత్వ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, ఖాళీగా ఉన్న పోస్టులెన్ని అన్న వివరాలతో కూడిన నివేదికను సర్కారుకు అందజేసినట్టు తెలిసింది.



## రైతు పరిస్థితి విషమం

- ఎస్‌వోటీ పోలీసుల అత్యుత్సాహం
- ఆత్మహత్యకుయత్నించిన రైతు
- యాదగిరిగుట్ట మండలం కాచారంలో ఘటన
- ఫిర్యాదు తీసుకోని పోలీసులు

యాదగిరిగుట్ట, మే 27: ఎస్‌వోటీ పోలీసుల అత్యుత్సాహంతో ఆత్మహత్యకు పాల్పడిన రైతు పరిస్థితి విషమంగా మారింది. ప్రస్తుతం ఆయన సికింద్రాబాద్ యశోద దవాఖాన ఐసీయూలో కోమాలో ఉన్నట్టు తెలిసింది. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి చెందిన రైతు దడిగే రాములు బీటీ-3 పత్తి విత్తనాలను విత్తుతున్నారన్న సమాచారంతో భువనగిరికి చెందిన ఎస్‌వోటీ సిబ్బంది దాడులు జరిపారు. నిషేధిత పత్తి విత్తనాలు కొనుగోలు చయడం నేరమని చెప్పడంతో.. ఆ విషయం తనకు తెలియదని, తెలిస్తే కొనుగోలు చేసేవాడిని కాదని చెప్పినా ఎస్‌వోటీ పోలీసులు పట్టించుకోలేదు. దీంతో రాములు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు వ్యవసాయ బావివద్ద గల పురుగుల మందు తాగారు. అక్కడే ఉన్న పోలీసులు అతడిని తమ వాహనంలో స్థానిక దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో సికింద్రాబాద్ యశోదకు తరలించారు. ప్రస్తుతం చావుబతుకుల మధ్య కొట్టిమిట్టాడుతున్నట్టు సమాచారం.

### ఫిర్యాదు చేసేందుకు పడిగాపులు..

ఎస్‌వోటీ పోలీసులు ఒత్తిడి, భయభ్రాంతులకు గురిచేయడంతోనే రాములు ఆత్మహత్యకు పాల్పడ్డాడరని కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. సాయంత్రం 4 గంటలకు యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ను చేరుకుని రాత్రి 10 గంటల వరకు పడిగాపులు కాశామని బాధితుడి తమ్ముడు ఆంజనేయులు, భార్య రాజేశ్వరి తెలిపారు. పోలీసులు ఫిర్యాదు వద్దని, ఏదైనా ఉంటే మాట్లాడుకుందామని చెప్పారని పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ నేత ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారిని సముదాయించినట్టు తెలిసింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయకుండానే వెనుదిరిగారు.

# మిస్టర్ టెన్ పర్సెంట్!

మొదటిపేజీ తరువాయి...

కంపెనీలు, ఇటు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు వాపోతున్నారు. దీంతో ఎస్పీడీసీఎల్ పరిధిలో దాదాపు 500 కిలోమీటర్ల మేర 33కేవీ కేబుల్ పనులు ఆరు నెలలుగా ఆగిపోయాయని సమాచారం. ఈ పనులు పూర్తయితే కరంటు చార్జీల రూపంలో సంస్థకు నెలకు రూ.కోట్లలో ఆదాయం వచ్చేదని, ఆ బాస్ మొండిపట్టుతో రాబడికి కూడా గండిపడిందన్న చర్చ జరుగుతున్నది.

### కమీషన్ రూ.21 కోట్లు.. భారం మోసేది ఎవరు?

ఏడాది కాలంగా స్టోర్‌లో టెండర్ల ద్వారా సమకూర్చుకునే ప్రతి సామగ్రిపైనా పది శాతం ముట్టజెప్పాలనే అనధికారిక నిబంధన అమలులోకి వచ్చిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఒక కిలోమీటరు 33 కేబుల్ విలువ రూ.41.52 లక్షలుగా ఉన్నది. అంటే పెండింగ్‌లో ఉన్న 500 కిలోమీటర్ల మేర కేబుల్ కొనుగోలుకు రూ.207.60 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందులో ఆయన అడుగుతున్న 10 శాతం కమీషన్ విలువ దాదాపు రూ.21 కోట్లు అన్నమాట. దీనిని ఎవరు భరించాలన్నదే ఇప్పుడు తలనొప్పిగా మారిందట. కేబుల్ కొనుగోలు కోసం అధికారులు టెండర్లు పిలిస్తే ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్) ప్రకారం మొత్తం విలువను కోట్ చేస్తారు. ప్రస్తుతం ఎస్ఎస్ఆర్ ప్రకారం 33 కేవీ కేబుల్ మీటరు ధర రూ.4,152. ఈ ధర ప్రకారమే కేబుల్ తయారీ కంపెనీలు సరఫరా చేస్తాయి. అదనంగా పది శాతం పెంచాలంటే ఎస్ఎస్ఆర్‌ను సవరించాలి. ఇది ప్రభుత్వస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కమిటీ భేటీ అయ్యి, మార్కెట్లో అందుబాటులో ఉన్న ధరలపై చర్చించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో అనధికారిక పది శాతాన్ని సర్దుబాటు చేయలేమని కంపెనీలు కరాఖండిగా చెప్పేసినట్టు సమాచారం.

### చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు

టెండర్లలో నిబంధనల ప్రకారం కేబుల్‌ను డిస్కం సరఫరా చేస్తుంది. కాంట్రాక్టర్లు సివిల్, ఇతరత్రా పనులు చేయాల్సి ఉంటుంది. అయితే.. 33 కేవీ కేబుల్ కొనుగోలుకు 'మిస్టర్ 10%' అనుమతి ఇచ్చే అవకాశం లేకపోవడంతో, కేబుల్ తెచ్చుకోవాలని కాంట్రాక్టర్లకు అధికారులు సూచిస్తున్నారట. అయితే ఈ ప్రతిపాదనను కాంట్రాక్టర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని సమాచారం. సాధారణంగా డిస్కంలు వందల కిలోమీటర్ల కేబుల్‌ను ఒక్కసారే కొనుగోలు చేస్తాయి కాబట్టి కంపెనీలు రూ.4,152 ప్రకారం ఇస్తున్నాయి. దీని ఆధారంగానే పనుల అంచనా వ్యయాన్ని లెక్కించి, అధికారులు టెండర్లు అప్పగించారు. ఇప్పుడు కాంట్రాక్టర్లు వ్యక్తిగతంగా 10, 20 కిలోమీటర్ల కేబుల్ కొనుగోలు చేయాలంటే తయారీ కంపెనీలు ధరను పెంచుతాయి. ఆ భారం తాము మోయలేమని కాంట్రాక్టర్లు చేతులెత్తేశారట. నిబంధనల ప్రకారం డిస్కం కేబుల్ ఇవ్వాలని, ఇప్పుడు తమపై ఆర్థిక భారం మోపితే ఎలా? అని ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. లేదంటే 'అదనం'గా అయ్యే ఖర్చు ఇస్తేనే పనులు చేస్తామని తెగేసి చెప్తున్నట్టు తెలిసింది. దీంతో ఏ కారణంతో టెండర్ విలువ సవరించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారట.


### గతంలో ఎప్పుడూ లేదు..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిస్కం స్టోర్‌లో అన్ని రకాల సామగ్రి నిత్యం అందుబాటులో ఉండేదని, ఎప్పటికప్పుడు టెండర్లు పిలిచి స్టాక్ ఉండేలా చూసుకునేవారమని అధికారులు చెప్తున్నారు. స్టోర్స్ వ్యవహారంలో 'పెద్దలు' ఎవరూ జోక్యం చేసుకునేవారు కాదన్నారు. కానీ ఇప్పుడు.. 'మిస్టర్ 10%' ప్రతి దానికి అడ్డం పడుతున్నారని చెప్తున్నారు. ఆయనకు, మెటీరియల్ కొనుగోలు చేసే విభాగం అధికారికి దగ్గరి సంబంధాలు ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే ఇతర ఉన్నతాధికారులెవరూ ఈ విషయంలో జోక్యం చేసుకోవడం లేదని చెప్పుకుంటున్నారు. మరోవైపు వర్షాకాలం వచ్చేసిందని, రోడ్లు తవ్వేందుకు జీహెచ్ఎంసీ అనుమతులు నిలిపివేసిందని అధికారులు చెప్తున్నారు. దీంతో పెండింగ్ పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి లేదన్నారు. అక్టోబర్‌లో తిరిగి రోడ్డు తవ్వకాలకు అనుమతులు వస్తాయని, అంటే మరో నాలుగైదు నెలలు పనులు ఆగిపోక తప్పదని స్పష్టం చేస్తున్నారు. ఒక్క వ్యక్తి వల్ల అటు రూ.పదుల కోట్ల అత్యవసర పనులు ఆగిపోయాయని, ఇటు డిస్కంకు రూ.కోట్ల రాబడికి గండిపడిందని చెప్తున్నారు.

### నిలిచిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు

సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద హైదరాబాద్ నగరంలో 16 అత్యవసర పనులకు అధికారులు ఆరు నెలల కిందట టెండర్లు పిలిచారు. ఇందులో వంద కిలోమీటర్ల మేర 33 కేవీ కేబుల్ వేయాల్సి ఉన్నది. ఫిబ్రవరిలో టెండర్లు తెరిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేశారు. మార్చిలో ఒప్పందం పూర్తయింది. కానీ కేబుల్ లేకపోవడంతో వేసవిలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు పూర్తి కాలేదు. వాస్తవానికి ఇవన్నీ ఫీడర్లపై భారాన్ని తగ్గించేందుకు చేపట్టిన అత్యవసర పనులే. పూర్తి కాకపోవడంతో ఫీడర్లపై భారం పెరుగుతున్నదని అధికారులు చెప్తున్నారు. ఆయా ప్రాంతాల్లో కరెంటు సరఫరాలో తీవ్ర అవాంతరాలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణలో భాగంగా రెండు విద్యుత్ ఫీడర్లు వేయాల్సి ఉన్నది. 18 కిలోమీటర్ల మేర 33 కేవీ కేబుల్ వేసేందుకు రైల్వే అధికారులు ఎస్పీడీసీఎల్‌కు రూ.36 కోట్లు డిపాజిట్ చేశారు. డిస్కం అధికారులు కొన్ని నెలల కిందటే టెండర్లు పూర్తి చేసి, కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసి ఫైల్‌ను ఉన్నతాధికారులకు పంపారు. పనులు పూర్తయితే రైల్వే స్టేషన్ నుంచి డిస్కంకు నెలకు రూ.కోటి వరకు కరెంటు బిల్లుల రూపంలో ఆదాయం వస్తుందని అంచనా వేశారు. కానీ.. స్టోర్‌లో కేబుల్ లేకపోవడం, కొనుగోలుకు 'మిస్టర్ 10%' అనుమతించే అవకాశం లేకపోవడంతో ఉన్నతాధికారులు ఆ దస్త్రాన్ని పక్కన పెట్టారట.
- దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి ప్రస్తుతం ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను 33కేవీకి అప్‌గ్రేడ్ చేయాల్సి ఉన్నది. ఈ పనులకు రూ.1.92 కోట్లు ఖర్చవుతుందని డిస్కం అధికారులు అంచనా వేయగా, ఈ మేరకు ఎయిర్‌ఫోర్స్ అకాడమీ ఆ మొత్తాన్ని డిపాజిట్ చేసింది. విద్యుత్ అధికారులు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌ను ఎంపిక చేశారు. ఈ పని పూర్తయితే నెలకు రూ.15 లక్షల కరెంటు బిల్లు అదనంగా డిస్కంకు వస్తుందని భావించారు. కానీ.. 'మిస్టర్ 10%' కారణంగా స్టోర్‌లో 33 కేవీ కేబుల్ లేకపోవడంతో ఉన్నతాధికారులు ఈ పనులను కూడా మొదలుపెట్టేందుకు అనుమతి ఇవ్వలేదని చెప్తున్నారు.



## ఐఏఎస్ బదిలీల జాబితా ఖరారు!

- ధ్రువీకరించిన సీఎం వో వర్గాలు
- నెల నుంచి ఊరిస్తున్న బదిలీలు
- జూన్ 6 లోపు కలెక్టర్ల బదిలీలకు రంగం సిద్ధం

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): ఐఏఎస్‌ల బదిలీలపై నెల రోజులుగా కొనసాగుతున్న అనిశ్చితి ఒక కొలిక్కి వచ్చినట్టు తెలుస్తున్నది. వచ్చే నెల మొదటి వారంలో ఎప్పుడైనా కలెక్టర్ల బదిలీలు ఉండవచ్చని సీఎంవో వర్గాలు ధ్రువీకరించాయి. మే నెల మొదటి వారంలోనే కొన్ని ప్రధాన శాఖల హెచ్‌వోడీలు, జిల్లా కలెక్టర్ల బదిలీలు జరుగుతాయని, జాబితా కూడా సిద్ధమైందని సీఎంవో నుంచే లీకులు వచ్చాయి. కొత్త సీఎస్ బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో ఐఏఎస్‌ల బదిలీలు ఇక లాంఛనమే అనే ప్రచారం జరిగింది. తెర వెనుక ఏం జరిగిందో ఏమో గానీ ఐఏఎస్‌ల బదిలీలకు బ్రేక్ పడింది. మరోవైపు బదిలీ తప్పదనుకున్న అధికారులు అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా వదిలేసినట్టు జిల్లా యంత్రాంగంలో చర్చ జరుగుతున్నది.

### సీఎం వర్సెస్ మంత్రులు

సీఎం, మంత్రుల మధ్య నెలకొన్న అగాధమే ఐఏఎస్‌ల బదిలీల బ్రేక్‌కు కారణం అని సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. జిల్లా అడ్మినిస్ట్రేషన్‌ను పూర్తిగా గుప్పిట్లో పెట్టుకోవాలనే ఆలోచనతో సీఎంవో కసరత్తు చేసినట్టు తెలిసింది. తమ ఆధీనంలో ఉండి పనిచేసే కలెక్టర్లను ఏరి కోరి పోస్టింగుల్లో సర్దుబాటు చేసినట్టు, రాష్ట్రంలో ఏ మూలన చీమ చిటుక్కుమన్నా.. క్షణాల మీద సీఎంవోకు సమాచారం చేరవేసేంత విధేయత ఉన్న అధికారులతో జాబితా రూపొందించినట్టు సమాచారం. ఈ జాబితాకే సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. ఈ జాబితాలోని పేర్లు బయటికి పొక్కడంతో మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. తమ ప్రమేయం లేకుండా కలెక్టర్ల పోస్టింగుల మీద ఎలా నిర్ణయం తీసుకుంటారని వారు ఎదురుతిరిగినట్టు తెలిసింది. దక్షిణ తెలంగాణలోని ఒక కలెక్టర్‌పై అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ బదిలీల జాబితాలో సదరు వ్యక్తి పేరు లేకపోవడంతో అక్కడి నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

### 15 జిల్లాల కలెక్టర్ల మీద నేతల ఫిర్యాదు

ప్రస్తుతం 15 జిల్లాల కలెక్టర్ల మీద మంత్రులు, ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ ఫిర్యాదుల ఆధారంగానే సీఎంవో ఈ 15 మందితోపాటు, 12 మంది అదనపు కలెక్టర్లను, 10 మంది జాయింట్ కలెక్టర్లను బదిలీ చేస్తూ లిస్టు ఫైనల్ చేసినట్టు సమాచారం. నేతల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న సీఎంవో.. వారి అభిప్రాయాలు తెలుసుకోకుండా జాబితా రూపొందించినట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎదురు తిరిగినట్టు సమాచారం. ఈ పరిస్థితిపై డోలాయమానంలో పడిన సీఎం ఇప్పటికే ఉన్న విభేదాలు మరింత పెరుగుతాయేమోనన్న ఆందోళనతో ఉన్నట్టు తెలిసింది. పోనీ మంత్రులు సూచించిన పేర్లతో బదిలీలు చేస్తే పాలనా వ్యవస్థ చేజారిపోతుందమోనని సీఎంవో భావిస్తున్నట్టు సమాచారం. సదరు అధికారులు తన మాట కాకుండా మంత్రుల మాటకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంటుందని, అప్పుడు మరింత ఇబ్బంది ఏర్పడుతుందనే ఆలోచనలో సీఎం ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

### జిల్లాల సర్దుబాటుతో సమస్య కొలిక్కి..

ఆయా మంత్రుల అభిప్రాయం మేరకు.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జిల్లాలు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎంవో సూచించిన బదిలీలతో తుది జాబితా రూపొందించినట్టు తెలిసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, హన్మకొండ, ఖమ్మం తదితర జిల్లాల కలెక్టర్ల బదిలీలపై క్లారిటీ వచ్చినట్టు సీఎంవో వర్గాలు చెప్తున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో ఇద్దరు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇద్దరు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్కరు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఒకరు, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ఇద్దరేసి చొప్పున కలెక్టర్లు, ఆ కింది స్థాయి అధికారులు బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. జూన్ 6 లోపు కలెక్టర్ల బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని, ఇప్పుడు బదిలీ చేస్తే మళ్లీ ఏడాది, ఏడాదిన్నర వరకు ట్రాన్స్‌ఫర్ల జోలికి వెళ్లకుండా.. పూర్తిగా పాలనపైనే ఫోకస్ పెట్టే విధంగా కసరత్తు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు తెలిసింది.

# నికార్సైన మాదిగ నేతకే.. మినిస్ట్రీ ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి...

వారు మీటింగ్‌లో నిర్ణయించినట్టు ప్రచారం జరుగుతున్నది. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో ఈ భేటీ జరిగినట్టు తెలిసింది. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఈ భేటీకి హాజరైనట్టు సమాచారం. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వివిధ కారణాలతో హాజరుకాలేదని, కానీ వారి సమ్మతితోనే సమావేశం జరిగినట్టు తెలిసింది. వీరందరూ తమ సామాజికవర్గానికి మంత్రివర్గ విస్తరణలో స్థానం కల్పించాలని కోరుతూ ఈ నెల 24న సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు



మల్లికార్జునఖర్గేకు లేఖ రాశారు. ఆ లేఖ మీద ఒక్క కాలె యాదయ్య మినహా అందరూ సంతకాలు చేసినట్టు తెలిసింది.

### మీనాక్షితో భేటీ!

తెలంగాణలో మాదిగ ఓటర్లు 47 లక్షల మంది ఉన్నారని, వీరంతా గత ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి మద్దతుగా ఉండి అధికారంలోకి తీసుకొచ్చారని, అయినా.. తమకు క్యాబినెట్‌లో స్థానం దక్కలేదని మాదిగ సామాజికవర్గపు ఎమ్మెల్యేలు చర్చించినట్టు తెలిసింది. ఇప్పుడు మంత్రివర్గంలో ఉన్నది మాదిగ నేత కాదని, మాదిగ ఉపకులానికి చెందిన వ్యక్తి అని వీరు వాదిస్తున్నట్టు సమాచారం. త్వరలో జరుగబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజికవర్గానికి స్థానం ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. సమావేశం అనంతరం ఎమ్మెల్యేలు ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో ఫోన్‌లో మాట్లాడి, తమ డిమాండ్లను వినిపించినట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంపై మరింత చర్చించేందుకు ఢిల్లీకి వచ్చి స్వయంగా కలవాలని మీనాక్షి నటరాజన్ సూచించినట్టు సమాచారం. కాగా ఈ రహస్య భేటీకి సంబంధించి ఎటువంటి ఫొటోలు విడుదల కాకపోగా.. హాజరైన ఎమ్మెల్యేలు సైతం ఎటువంటి వివరణ ఇవ్వలేదు.

## 20లోగా లొంగిపోండి

- లేకుంటే నేరస్తుడిగా ప్రకటిస్తాం
- ప్రభాకర్‌రావు ఇంటికి నోటీసులు అంటించిన పోలీసులు

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో జూన్ 20లోగా నాంపల్లి కోర్టులో లొంగిపోవాలని ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు పోలీసులు స్పష్టం చేశారు. లేకపోతే నేరస్తుడిగా ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఇబ్రహీంబాగ్‌లోని తారమతి బారాదరిలో ఆయన ఇంటికి కోర్టు నోటీసులు అంటించారు. దీంతో ప్రస్తుతం అమెరికాలో క్యాన్సర్ చికిత్స చేయించుకుంటున్న ప్రభాకర్‌రావు హైదరాబాద్‌కు తిరిగిరావడం అనివార్యమైంది.